## క్లుప్తంగా

### సీఏఎస్ఎం వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ అరుణ్



కర్నూలు (హాస్పిటల్): ఇండోర్‌లోని కౌన్సిల్ ఆఫ్ ఆల్టర్నేటివ్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్స్ (సీఏఎస్ఎం) వైస్ ప్రెసిడెంట్‌గా కర్నూలుకు చెందిన హోమియో వైద్యులు డాక్టర్ అరుణ్ కుంద వరం నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.ఎం.ఖురేషి నియామక ఉత్తర్వులు పంపించారు. ప్రత్యామ్నాయ వైద్య అభివృద్ధిలో భాగంగా డాక్టర్ అరుణ్ చేస్తున్న కృషికి గాను ఈ నియామకం చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. హోమియో అభివృద్ధిలో జరిగే అన్ని రకాల కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యులు కానున్నట్లు తెలిపారు.

### పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఎగువన కురిసిన వర్షాలకు శ్రీశైలానికి భారీ ఎత్తున వరద నీరు వచ్చి చేరుతుండడంతో పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీటిని విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షాభావంతో పంటలు ఎండుతున్న సమయంలో తుంగభద్ర డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయడం హర్షణీయమన్నారు.

### సార్వత్రిక సమ్మెకు పెరుగుతున్న మద్దతు

కర్నూలు(సెంట్రల్): మోదీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన చేపట్టే సార్వత్రిక సమ్మెకు మద్దతు పెరుగుతోంది. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా చేపట్టే సమ్మెకు భవన నిర్మాణ కార్మిక సంఘం మద్దతు ఇస్తున్నట్లు ఆ సంఘం నాయకులు కె.సుధాకరప్ప, జి.ఏసు ప్రకటించారు. అలాగే రోడ్డు సైడు వ్యాపారులు కూడా సమ్మెలో పాల్గొననున్నట్లు ఆ సంఘం నగర కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమన్నారు. లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. 8 గంటల పని విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరారు.

### ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టాలి

కర్నూలు(అర్బన్): నగరంలోని ఇందిరాగాంధీ నగర్ ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న సరుకులను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేయాలని నవ్యాంధ్ర స్టూడెంట్ జేఏసీ అధ్యక్షుడు అయ్యస్వామి, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.వెంకటేష్ కోరారు. ఈ మేరకు గురువారం అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాస్టల్‌కు నాసిరకమైన కూరగాయలు, సరుకులను సరఫరా చేస్తూ వార్డెన్ నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. దీంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### రగ్బీ క్రీడాకారిణికి చేయూత



రగ్బీ క్రీడాకారిణికి నగదు ప్రోత్సాహకం అందిస్తున్న బి.టీ.అనురాధ

కర్నూలు (టౌన్): డెహ్రాడూన్‌లో ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొంటున్న కర్నూలు క్రీడాకారిణి శృతి ప్రతిభ చాటి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ మాజీ మేజిస్ట్రేట్ బి.టి.అనురాధ సూచించారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో క్రీడాకారిణికి ఆర్థికంగా చేయూత అందించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు గుడిపల్లి సురేందర్ పాల్గొన్నారు.

### తప్పుల్లేని ఓటరు జాబితాకు సహకరించండి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): కర్నూలు నియోజకవర్గ ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందించేందుకు సహకరించాలని రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ యస్.రవీంద్రబాబు కోరారు. ఆయన గురువారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థలోని చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఓటరు నమోదు, తొలగింపు, సవరణలు వంటి మార్పు చేర్పులకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చిందని, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సూచనలు తెలియజేయవచ్చన్నారు. ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఓటర్ల సమస్యలను తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తహసీల్దార్ రవికుమార్, సూపరింటెండెంట్ సుబ్బన్న, డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

# అర్ధరాత్రి టెంట్ పీకేశారు!

- కార్మికుల సమ్మె టెంట్‌ను పీకేయించిన అధికారులు
- అవసరం లేకున్నా సిల్ట్ పనులు చేయిస్తున్న వైనం
- నగరపాలక ప్రాంగణంలో కొనసాగుతున్న కార్మికుల సమ్మె



నగర పాలక కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్

కర్నూలు (టౌన్): కార్మికులంటే నగరపాలక అధికారులకు చిన్న చూపు ఉన్నట్లుంది. అందుకే 57 రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఎలాగైనా ఇబ్బందులు సృష్టించాలనుకున్నారు. అంతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు.. అర్ధరాత్రి టౌన్ ప్లానింగ్‌కు చెందిన ఓ కింది స్థాయి అధికారి మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న టెంట్‌ను పీకేశారు. అలాగే కార్మికులు కూర్చొని ధర్నా చేసే స్థలంలో మురుగు కాల్వపై ఉన్న బండరాళ్లు తొలగించి సిల్ట్ లేకున్నా మురుగును తొలగించారు. కార్మికులు ధర్నా చేయకూడదని అధికారులు ఉద్దేశపూర్వకంగా అక్కడ మురుగు పనులు చేయిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం**

తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక నాయకులు మనోహర్, వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. టెంట్‌ను తొలగించడంతో కార్మికులు కార్యాలయం ప్రాంగణంలో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపకపోవడం దారుణమన్నారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న తమకు జీతం రూ.24 వేలకు పెంచాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. నగరపాలక సంస్థ బయట సమ్మె చేయరాదని చెప్పగా తమను ఇబ్బందులు పెట్టినందుకు కార్యాలయం ప్రాంగణంలో శాంతియుతంగా ధర్నా వారు చెప్పారు. ఇక్కడ కూడా ఇబ్బందులు సృష్టిస్తే కార్యాలయం లోపల ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. సమ్మె విరమించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు.

## 6 నుంచి విష్ణు సహస్రనామ పారాయణం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గోదా గోకులం సభ్యులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా రంగనాయకి సమేత రంగనాథ స్వామి ఆలయంలో ఈ నెల 6వ తేదీ నుంచి విష్ణు సహస్ర నామ అఖండ పారాయణం నిర్వహించనున్నట్లు గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త తెలిపారు. ఈ మేరకు గురువారం గోదాగోకులంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఆషాఢ శుద్ధ ఏకాదశి ప్రారంభ రోజున చతుర్మాస వ్రత దీక్షతో పారాయణం ప్రారంభించనున్నట్లు తెలిపారు. త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనంతో ఈ నెల 6 నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు 63 రోజుల పాటు రోజూ తెల్లవారుజామున 5.30 గంటల నుంచి సాయంత్రం 6.45 గంటల వరకు పారాయణం చేయనున్నట్లు చెప్పారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. గోదా గోకులం సభ్యులు పెరుమాళ్ల బాలసుధాకర్, తుమ్మేపల్లి శ్రీనివాసరావు, ఇటికాల పుల్లయ్య, పాలాది వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## బాలికకు అరుదైన శస్త్రచికిత్స



ఆపరేషన్ చేయించుకున్న బాలికతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని అమీలియో హాస్పిటల్‌లో 12 ఏళ్ల బాలికకు వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణం పోశారు. చికిత్స వివరాలను గురువారం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ కృష్ణనాయక్, జనరల్ సర్జన్ డాక్టర్ రామచంద్రయ్య వివరించారు. అనంతపురం జిల్లా మండకల్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన 12 ఏళ్ల బిందు విపరీతమైన కడుపునొప్పితో ఆస్పత్రికి రాగా వైద్యపరీక్షలు నిర్వహించి సింట్రిక్ లింఫాటిక్ సిస్ట్ అనే వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించామన్నారు. గత నెల 30న బాలికకు రిసెక్షన్ అండ్ అనాస్టమోసిస్ అనే విధానంలో మూడు గంటల పాటు శ్రమించి విజయవంతంగా ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. తర్వాత బాలిక కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు చెప్పారు. మెసెంటెరిక్ లెంఫాడెనిటిస్ అనే వ్యాధి రెండు లక్షల మందిలో ఒకరికి మాత్రమే వస్తుందని, పుట్టుకతోనే వస్తుందని పేర్కొన్నారు. ఆపరేషన్‌కు అనెస్తీషియాలసిస్టు డాక్టర్ విజేత, వైద్య బృందం సహకారం అందించినట్లు తెలిపారు.

## స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): స్మార్ట్ మీటర్లను రద్దు చేసి వినియోగారులపై భారం తగ్గించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి అధికారంలోకి రాగానే మీటర్లను బిగించేందుకు ఆదేశాలు ఇవ్వడం అన్యాయమని మండిపడ్డారు. గురువారం సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన సీపీఎం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లు ప్రజల మెడలకు ఉరితాళ్లుగా మారుతాయన్నారు. వ్యాపార సమూదాయాలకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ ఇప్పటికే పూర్తి కాగా, రెండో దశంలో 200 యూనిట్లలోపు బిల్లు వచ్చే ఇళ్లకు బిగించేందుకు సిద్ధమవుతున్నారని మండిపడ్డారు. అధికారంలో లేని సమయంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టండన్న లోకేష్ ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. నెల్లూరులో అదానీకి 8 వేల ఎకరాలు కేటాయిస్తున్నారని ఆనాడు జగన్‌పై విమర్శలు చేసిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఆయనే ఇచ్చేశారని విమర్శించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం కార్యకర్తలు ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రామకృష్ణ, వెంకటేశ్వర్లు, ఎండీ ఆనంద్‌బాబు, కేవీ నారాయణ, టి.రాముడు, ఎండీ అంజిబాబు, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవం



విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న రవికుమార్

కర్నూలు (టౌన్): జీసస్ సోల్జర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో స్థానిక కోల్స్ సెంటీనియల్ పాఠశాలలో గురువారం సెయింట్ థామస్ డేను భారతీయ క్రైస్తవ దినోత్సవంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ.. ఏటా జూలై 3న యేసు భక్తి దివస్ పేరుతో క్రైస్తవ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యేసుక్రీస్తు వ్యక్తిత్వం, సందేశాన్ని వివరించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అంతకుముందు మంత్రి టీజీ భరత్ తన నివాసంలో సెయింట్ థామస్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మినిస్ట్రీస్ సభ్యులు ప్రసాదరావు, శైలశ్రీ, సరళ పాల్గొన్నారు.

## విద్యార్థులకు దాహం.. దాహం



ఇంటి నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకొని భోజనం చేస్తున్న విద్యార్థులు



మరమ్మతులు చేయించకపోవడంతో వృథాగా మారిన ఆర్ఓ ప్లాంటు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పూడూరు మండల ప్రాథమిక పాఠశాలలో తాగునీరు అందుబాటులో లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలలో ఆర్ఓ ప్లాంటును ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరమ్మతులకు గురైన ప్లాంటును అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ సమస్యపై ప్రధానోపాధ్యాయుడు గతంలో మండల విద్యాధికారికి ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. పాఠశాలలో 70 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారంతా పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేస్తారు. భోజనం సమయంలో, దాహం వేసినప్పుడు తాగునీరు లేక అల్లాడుతున్నారు. పాఠశాలలో తాగునీరు లేకపోవడంతో విద్యార్థులు వారి ఇళ్ల నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నారు. చిన్న పిల్లలు చదువుకునే పాఠశాలలో మంచి నీరు అందుబాటులో లేకపోవడం ఏమిటని, వారంతా గుర్తుపెట్టుకొని ఇంటి నుంచి నీటిని తెచ్చుకుంటారా? అని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. బాటిళ్లలో తెచ్చుకున్న నీరు అయిపోతే ఏమి చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులకు మంచినీరు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### బ్రాహ్మణ విద్యార్థులు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కర్నూలుతో పాటు కల్లూరు మండలంలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో 90 శాతానికి పైగా మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థులకు అందించనున్న ప్రోత్సాహకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 4వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ మార్కుల జాబితా జిరాక్స్ కాపీలను 4వ తేదీ సాయంత్రం 7 గంటల్లోపు సంకల్‌బాగ్ వేంకటేశ్వర స్వామి ఆలయం మేనేజర్‌కు అందించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 93936 05937, 94402 24878 నంబర్లను సంప్రదించాలన్నారు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిన అనంతరం జూలై 6న ఉదయం 10 గంటలకు సంకల్‌బాగ్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని, హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులకు భోజన సౌకర్యం కూడా కల్పించనున్నట్లు వెల్లడించారు.

### టూరిజం సంస్థలను ప్రైవేటుపరం చేయొద్దు

కర్నూలు కల్చరల్: ఏపీ టూరిజం సంస్థలను ప్రైవేట్‌పరం చేయడాన్ని అంగీకరించబోమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప స్పష్టం చేశారు. గురువారం వీఆర్ కాలనీలోని ఏపీటీడీసీ ఆవరణలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టూరిజం హోటళ్లను ప్రైవేట్ పరం చేస్తే గత 20 ఏళ్ల నుంచి సంస్థలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం టూరిజం హోటళ్లను ప్రైవేటు వారికి అప్పజెప్పే ఆలోచన విరమించుకోవాలన్నారు. టూరిజం అనే బ్రాండ్‌ను వాడుకుంటూ కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రం నిధులను విడుదల చేయించుకుంటున్నారని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితిలో ప్రైవేట్‌పరం కానివ్వమని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ సిటీ కార్యదర్శి చంద్రశేఖర్, టూరిజం ఉద్యోగులు పాల్గొన్నారు.

### సమ్మెను జయప్రదం చేయండి

కల్లూరు: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షులు సుధాకరప్ప కోరారు. గురువారం కల్లూరులోని సూర్యనారాయణ భవనంలో మట్టి పని అడ్డా కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సమావేశంలో భవన నిర్మాణ సంఘం నాయకులు యేసు, ఆంజనేయులు, రత్న, పక్కీరప్ప, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

### చినుకు పడితే చిత్తడే!



రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మట్టి రోడ్లు, గుంతలమయంగా ఉన్న రోడ్లు చిత్తడి చిత్తడిగా మారాయి. బస్తిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న రోడ్డుపై చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తోంది. దీంతో రోడ్డుపై నడవాలంటే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారు లు స్పందించి రోడ్డుపై వర్షం నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– కల్లూరు

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శివనరసింహారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కల్లూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం కర్నూలు జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా భీమశంకర్‌రెడ్డి, సెక్రటరీగా సత్యంరెడ్డి, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా హేమంత్ రెడ్డి, మైనారిటీ విభాగం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మొగల్ రోమ్ బేగ్ నియమితులయ్యారు. వీరు గురువారం కాటసాని రాంభూపాల్ రెడ్డి, శివనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పూలమాలతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, ఓర్వకల్లు ఎంపీపీ తిప్పన్న పాల్గొన్నారు.

## సిబ్బంది సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం ఆసుపత్రిలోని మినిస్టీరియల్ స్టాఫ్, సిబ్బందితో ఆయన తన ఛాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది సమయపాలన, ఎఫ్ఆర్ఎస్, సెక్షన్ల వారీగా ఎవరు ఏ పని చేస్తున్నారు, వారి పనితీరు గురించి ఆరా తీశారు. ఆసుపత్రిలో నాల్గవ తరగతి ఉద్యోగుల గురించి, వారి పనితీరు గురించి అడిగి తెలుసుకుని అసహనం వ్యక్తం చేశారు. ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ డ్రెస్ కోడ్, ఐడీ కార్డు ధరించి ఎఫ్ఆర్ఎస్ వేసి విధులు నిర్వహించాలని ఆదేశించారు. లేకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌టీ మెడికల్ రికార్డు సెక్షన్ ఉద్యోగులు రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా త్వరలో రిపోర్ట్, డెత్, బర్త్ సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. ఉద్యోగులు, సిబ్బంది అందరూ ఎఫ్ఆర్ఎస్ ద్వారానే తప్పనిసరిగా హాజరు వేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. మినిస్టీరియల్ స్టాఫ్ సీట్ల మార్పు, ఇతర వాటిపై సమీక్ష నిర్వహించిన అనంతరం సిబ్బందిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి ప్రజలకు, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఏడీ మల్లేశ్వరమ్మ, ఏఓ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాతాశిశు సంరక్షణకు కృషి



బుక్‌లెట్ అందిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): మాతాశిశు సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ సూచించారు. స్థానిక కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే వైద్యులకు హైరిస్క్ గర్భిణులకు అందించాల్సిన సమగ్ర సేవలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం అర్మాన్ సంస్థ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. గర్భిణిగా నిర్ధారణ అయిన వెంటనే తగిన వైద్య పరీక్షలు చేయాలని చెప్పారు. నిర్ణీత సమయంలో వీరికి స్కానింగ్, పరీక్షలు, వైద్యసేవలను అందిస్తూ ప్రసవం సురక్షితంగా అయ్యే విధంగా చూడాలని చెప్పారు. పరీక్షలు, వైద్య సేవల వివరాలను మాతాశిశు సంరక్షణ కార్డులో నమోదు చేయాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గర్భిణులలో ప్రమాదకర పరిస్థితులను ముందుగా అంచనా వేసి క్షేత్రస్థాయి స్పెషలిస్టు స్థాయి వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫాలో అప్ సేవల గురించి డాక్టర్ భావన, డాక్టర్ రోహిణి వివరించారు. డీఐఓ డాక్టర్ నాగప్రసాద్, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ మహేశ్వరప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు, డీపీఎంఓ డాక్టర్ ఉమ, డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లలో నాణ్యత పాటించాలి



అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ బి.నవ్య

కర్నూలు (టౌన్): అన్న క్యాంటీన్లలో భోజనం నాణ్యతగా ఉండాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ బి.నవ్య అధికారులను అదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న వినియోగదారులతో మాట్లాడారు. ఏమైనా లోపాలు ఉన్నాయా? అని ఆరా తీశారు. క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సరైన సమయానికి క్యాంటీన్‌ను తెరవాలన్నారు. నాణ్యత లోపించకుండా, ఫిర్యాదులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## స్వయం ఉపాధికి ప్రోత్సాహం



మొక్కను నాటుతున్న ఎల్‌డీఎం రామచంద్రరావు, సీఐ మన్సూరుద్దీన్

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధిలో రాణించేందుకు వీలుగా బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పుష్పకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం బ్యాంకుల నుంచి రుణాలు పొందడం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులు స్వయం ఉపాధిలో రాణించేందుకు కెనరా బ్యాంకు చక్కటి అవకాశాలు కల్పిస్తోందన్నారు. శిక్షణ పొందిన వారు రుణాలు పొంది స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఒకరిపై ఆధారపడకుండా స్వయం ఉపాధిలో సొంతకాళ్లపై నిలబడి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. లీడ్‌బ్యాంకు మేనేజర్ రామచంద్రరావు మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు 110 మంది పాల్గొన్నారు.

**ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం**

కెనరా బ్యాంకు అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి రుణాలు మంజూరు చేస్తున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రరావు తెలిపారు. గురువారం కెనరా బ్యాంకు 120వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్‌తో కలిసి పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పలు బ్రాంచీల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## టీబీ పరీక్షలు చేయించుకోండి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి హేమలత

కర్నూలు(రూరల్): పోషకాహార లోపం ఉన్న వారు టీబీ పరీక్షలు చేయించుకోవాలని, గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హేమలత సూచించారు. ఆమె గురువారం కర్నూలు మండలం పసుపుల గ్రా మంలో నిర్వహిస్తున్న టీబీ ముక్త అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రెండు వారాలకు మించి దగ్గు, జర్వం, రాత్రి పూట చెమటలు పట్టడం, 60 ఏళ్లు పైబడి పొగ తాగేవారు, మద్యం సేవించేవారు, పౌష్టికాహార లోపం ఉన్న వారికి టీబీ, గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించాలన్నారు. టీబీ రోగులకు దాతల సహకారంతో ప్రతినెలా పౌష్టికాహారం అందించాలని సూచించారు. టీబీని జయించిన వారి అనుభవాలను గ్రామస్తులతో పంచుకోవాలన్నారు. సర్పంచ్ సుశీలమ్మ, పీహెచ్ఎస్ హనుమంతమ్మ, మేల్ హెల్త్ సూపర్‌వైజర్ వేణుగోపాల్, టీబీ సూపర్‌వైజర్ నిషిత్, ఎంఎల్‌హెచ్‌పీ నమ్రత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.